నిరసన: చిల్లర వర్తకులకు హాకర్ జోన్ ఏర్పాటు చేయాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం ఎదుట నిరసన

పెందుర్తి: రెండు దశాబ్దాలుగా పెందుర్తి రైతు బజార్ వద్ద తోపుడు బండ్లతో జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల పట్ల అధికారులు దురుసుగా ప్రవర్తించి వారిని అక్కడి నుంచి తొలగించడం సరికాదని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, గోపాలపట్నం జోన్ గౌరవ అధ్యక్షుడు బి.వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్ట ప్రకారం ఎక్కడ చిరు వ్యాపారం చేసుకుంటే అక్కడే హాకర్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెందుర్తి రైతు బజార్ వద్ద జీవీఎంసీ అధికారులు తొలగించిన తోపుడు బండ్ల వర్తకులకు మద్దతుగా వేపగుంటలోని జోనల్ కార్యాలయం ముందు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ తక్షణమే చిరువ్యాపారులందరికీ హాకర్ జోన్ ఏర్పాటు చేసి వెండర్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ హైమావతికి వినతిపత్రం అందించారు.


ఆందోళనలో సీఐటీయూ నాయకులు, వర్తకులు

డిమాండ్: నేతలు దోచుకున్న భూముల్ని పేదలకివ్వాలి

నిరుపేదలకు అందులోనే ఇళ్లు నిర్మించాలి–సీపీఐ డిమాండ్

పెందుర్తి: రాజకీయ నాయకులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను పేదలకు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం సుజాతనగర్లోని వార్డు సచివాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పేదలకు 2 సెంట్ల ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సుజాతనగర్ కూడలి నుంచి పాపయ్యరాజుపాలెం వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని చాలామంది నాయకులు ప్రభుత్వ భూములను చెరబడుతున్నారన్నారు. వాటిని అధికారులు స్వాధీనం చేసుకుని నిరుపేదలకు అందులోనే ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. లేకపోతే ఎర్రజెండాలతో తాము భూపోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సచివాలయం అడ్మిన్‌కు వినతిపత్రం అందించారు. పెందుర్తి శాఖ కార్యదర్శి ఎస్.అసిరినాయుడు, ఎ.రమణ, అన్నపూర్ణ, అరుణ, రజని, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

విన్నపం: మంత్రి అనగాని దృష్టికి పంచగ్రామాల భూ సమస్య

రాజధానిలో మంత్రికి వినతిపత్రం అందించిన సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం

సింహాచలం: పంచగ్రామాల భూసమస్యని పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు పంచగ్రామాల భూముల కమిటీ నాయకులు కోరారు. అమరావతిలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. 30 ఏళ్లగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 1903 సర్వే సెటిల్మెంట్ రికార్డులో ఉన్న రైతుల దగ్గర స్థలాలు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ భూములకు సంబంధించి 1996–97లో అప్పటి తహసీల్దార్లు సింహాచలం దేవస్థానానికి రైత్వారీ పట్టాలు ఇవ్వడంతో సమస్య మొదలైందన్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని సంఘ కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు తెలిపారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, సంఘం అధ్యక్షుడు వీబీఎస్ ప్రతాప్, నాయకులు వి.హనుమంతరావు, టీఎల్‌జేవీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ప్రతినిధులు

క్లుప్తంగా

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన


స్వర్ణ పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం స్వర్ణ పుష్పార్చన విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 7 గంటల నుంచి ఈ పూజని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. విశేషంగా హారతులు అందించారు. అర్చకుడు నరసింహాచార్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

జాతీయ స్థాయి ఈత పోటీలకు 'సంస్కృతి' విద్యార్థులు


జాతీయ స్థాయి ఈత పోటీల్లో పాల్గొనే విద్యార్థులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: పల్నాడు జిల్లా నర్సారావుపేటలో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలకు చెందిన జి.ధార్మిక, స్మృతిరాణి, జి.రోహిణి, తేజరెడ్డిలు పాల్గొని పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటిన వీరు ఈ నెల 24 నుంచి 30 వరకు గుజరాత్(రాజ్‌కోట్)లో నిర్వహించే జాతీయ స్థాయి ఈత పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి గురువారం మీడియాకు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులను, ఇందుకు ప్రోత్సహించిన కోచ్ హరినాథ్‌రెడ్డిలను పాఠశాల సీఈవో కె.నిశాంత్‌తో కలిసి అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: పెదముషిడివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా లంకెలపాలెం, మంత్రిపాలెం, కన్నూరు, పెదముషిడివాడ, ఈ మర్రిపాలెం, గొన్నువానిపాలెం శివారు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–1, 2 పరిధి 33 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సంస్థ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్ల పరిధి గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఈ అసౌకర్యాన్ని గమనించి వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నేడు 'ఆదర్శ్'లో జాబ్‌మేళా

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఈ ఫ్లోరా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యొకొహోమా కంపెనీలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల్లో ఉపాధి కల్పన నిమిత్తం డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణత సాధించిన మహిళలు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటలకు విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు వెంట తెచ్చుకుని, ఇంటర్వ్యూకు హాజరు కావాల్సిందిగా సూచించారు.

ఇష్టారాజ్యంగా పార్కింగ్.. వాహనదారుల అవస్థ


ఎన్టీపీసీ వద్ద రోడ్డుపై నిలిపిన భారీ వాహనాలు


ఊటగెడ్డ జంక్షన్లో రోడ్డుపై నిలిచిన లారీలు


వెన్నెలపాలెం రోడ్డులో నిలిపిన బొగ్గు లారీలు

- రద్దీ రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాల నిలుపుదల
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

పరవాడ: నిత్యం రద్దీగా ఉండే రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా వాహనాలను పార్క్ చేయడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని లంకెలపాలెం కూడలి, రాంకీ, సింహాద్రి, మండల కాంప్లెక్స్, సబ్‌స్టేషన్, ఊటగెడ్డ కూడళ్లలో ఏర్పాటు చేసిన టీ, టిఫిన్, భోజనశాలల్లో టిఫిన్, భోజనాల కోసం డ్రైవర్లు తమ వాహనాలను రోడ్లపై అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. దీంతో ఆ రోడ్లలో రాకపోకలు సాగించే వాహనదారులు అష్టకష్టాలు పడుతున్నారు.

నిత్యం రద్దీగా ఉండే లంకెలపాలెం–యలమంచిలి, వాడచీపురుపల్లి–పరవాడ రోడ్లలో తరచూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఎన్టీపీసీ, హిందూజా పరిశ్రమలకు బొగ్గు, బూడిద తరలించే భారీ వాహనాలను వారి అవసరాల కోసం రహదార్లపై అడ్డదిడ్డంగా నిలిపేస్తున్నారు. గంటల తరబడి ఆ వాహనాలు అక్కడే ఉంటున్నాయి. అసలే ఇరుకు రోడ్లు ఆపై భారీ వాహనాలను నిలపడంతో రోడ్డు మార్జిన్‌లు బాగా తగ్గుతున్నాయి. ఈ స్వల్ప మార్జిన్ల ద్వారా వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. చాలాసార్లు వాహనాలు ఒకదానికొకటి రాసుకుపోయి గీతలు పడుతున్నాయని వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలుపుతున్న డ్రైవర్లపై పోలీసులు కన్నెత్తి చూడట్లేదు. ఇప్పటికైనా ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక

పెందుర్తి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరంగా చేస్తున్న కార్యక్రమాలను అధినేతకు వివరించారు. భవిష్యత్ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలో అనుసరించాల్సిన కార్యాచరణపై పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పలు సూచలిచ్చారని, ఆ మేరకు పార్టీ పునర్వైభవానికి కృషి చేయనున్నట్లు అదీప్‌రాజ్ తెలిపారు.



జూనియర్ కళాశాలలో ఆధార్ సేవా కేంద్రం


ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆధార్ సేవా కేంద్రాన్ని ఎంపీడీవో పద్మజ గురువారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు అందుబాటులో ఉండే ఈ సేవల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైతే సేవలను మరిన్ని రోజులు పొడిగిస్తామన్నారు. ఆధార్ కార్డులోని పుట్టినతేదీ, చిరునామా తప్పులు తదితరాలను సరిచేసుకోవచ్చన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఇంటర్ వరకూ విద్యార్థులకు ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) కార్యక్రమం చురుగ్గా సాగుతోందన్నారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యంలో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు 10,496 మంది విద్యార్థులున్నారని, వీరిలో ఇప్పటికే 72 శాతం నమోదు ప్రక్రియ పూర్తయినట్లు పేర్కొన్నారు. అపార్‌లో విద్యార్థులు తప్పుల్లేని వివరాలను నమోదు చేసుకునేందుకు వీలుగా ఆధార్ కార్డులో సవరణ చేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అవసరమైతే పాఠశాల స్థాయిలో ఆధార్ సేవా కేంద్రాల ఏర్పాటును పరిశీలిస్తామన్నారు.

నారపాడులో వరి పంటకోత ప్రయోగాలు

- పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

సబ్బవరం: పంటకోత ప్రయోగాలే పంటల దిగుబడికి ప్రామాణికమని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తెలిపారు. మండలంలోని నారపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన వరి పంటకోత ప్రయోగాలను ఆయన పరిశీలించారు. దీని ద్వారా జిల్లాలో వరి పంట దిగుబడి సరళిని తెలుసుకోవచ్చన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు వారికి కేటాయించిన మేరకు పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని వరి పంటకోత ప్రయోగాలను అత్యంత జాగ్రత్తతో చేయాలని సూచించారు. జిల్లాలో వరి పంట నాట్లు నుంచి కోత సమయం వరకూ వర్షపాతం అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉండొచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం 5/5 మీటర్ల విస్తీర్ణంలో జరిపిన పంట కోత ప్రయోగంలో 20.07 కిలోల దిగుబడి రావడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏడీఏ వసంతకుమారి, ఏఎస్‌వో రమాదేవి, టాటా బీమా కంపెనీ ప్రతినిధి చల్లా వాసు, గ్రామ వ్యవసాయ సహాయకులు హరీష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


వరి పంటకోత ప్రయోగాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలికి సత్కారం


నాగమణిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా పురస్కారం అందుకున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ ఎం.నాగమణిని ఘనంగా సత్కరించారు. కళాశాల ఆవరణలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ దుశ్శాలువా కప్పి, జ్ఞాపికను అందించి అభినందించారు. కళాశాల అధ్యాపకులు వి.ఆర్.ఎల్.మూర్తి, కె.సత్తిబాబు, బి.శేషసాయి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే

- అలసత్వం వహించే ఉద్యోగులపై చర్యలు
- జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

సబ్బవరం: స్వర్ణాంధ్ర–2047 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని బాటజంగాలపాలెంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో భాగంగా సేకరించిన వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను గురువారం ఆమె పర్యవేక్షించారు. సర్వేలో సేకరించిన వివరాలను ఎటువంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆమె అసకపల్లి, పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వాటి నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం స్వర్ణాంధ్ర సర్వేపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ నాగలక్ష్మి, ఈవోపీఆర్డీ బి.చైతన్య, సర్పంచ్ పడాల వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వర్ణాంధ్ర సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న డీపీవో శిరీషారాణి

విద్యుత్ సామర్థ్యం పెంపుపై విద్యార్థులకు పోటీలు


బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ, అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయి బీఈఈ పోటీలను దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో గురువారం నిర్వహించారు. విద్యుత్ సామర్థ్యం పెంపు అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలను సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సమీర్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పలు పాఠశాలల నుంచి 110 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్థిరమైన అభ్యాసాలను స్వీకరించాలని సూచించారు. పోటీల్లో పాఠశాల స్థాయి నుంచి హాజరైన విద్యార్థులను ఏ, బీ గ్రూపులుగా విభజించారు. పోటీలకు హాజరైన విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, ప్రతి గ్రూపు నుంచి వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి, ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. యువతలో దాగివున్న ప్రతిభను ప్రోత్సహించడంలో సింహాద్రి ఎన్టీపీసీ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీ ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు